రహదారిపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని మోదకొండమ్మ ఆలయం వద్ద వార్డు మెంబర్ పాడి.వెంకట్ ఆధ్వర్యంలో యువకులు స్వచ్ఛందంగా రహదారి గుంతలను పూడ్చారు. మోదకొండమ్మ ఆలయం దగ్గర నుంచి నిత్యం స్కూలుకు రాకపోకలు సాగించేందుకు నిత్యం జనాలతో రద్దీగా ఉంటుంది. ఇదే రహదారి మీదుగా కామాయపేట ఒరిస్సా వెళ్లేందుకు వాహనాలు వెళతుంటాయి. ఆలయానికి వచ్చే పెద్ద వాహనాల రాకపోకలతో మలుపు వద్ద పెద్ద రంధ్రం ఏర్పడింది. కమిటీ యువకులు ముందుకొచ్చి రాళ్లను, కేసర్ బుగ్గిని వేసి గుంతను పూడ్చారు.

పూడుస్తున్న యువకులు

ఎరువుల కొరతతో ఇక్కట్లు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ మండలంలో ఎరువుల కొరత ఏర్పడుతోంది. మండలంలో ఎరువులు కొరత ఏర్పడటంతో వ్యవసాయం సాగు చేసే గిరి రైతులు ఎరువులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో, ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో లేవు. దీంతో గిరి రైతులు ఏమి చేయాలో తోచక ఆందోళనకు గురవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఎరువుల కోసం రైతులు పక్క రాష్ట్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో రైతులకు సరిపడే యూరియా డిఏపి ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శుక్రవారం జరిగే వారపు సంతలో గల ప్రైవేట్ డీలర్ వద్ద ఎరువులు కొనుగోలు చేయడానికి రైతులు మారుమూల గ్రామాల నుంచి తరలివచ్చారు. ఆ డీలర్ షాపులో కూడా ఎరువులు కొరత ఉండడంతో కొనుగోలు చేయడానికి వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. పక్క రాష్ట్రంలో అధిక ధరలను విక్రయిస్తున్నా తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేసి తీసుకొచ్చి ఉపయోగిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకులో షాపు వద్ద ఎరువుల కోసం వేచి ఉన్న గిరి రైతులు

తక్షణమే ప్రభుత్వ సంధించి యూరియా డిఏపి ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించండి

జిల్లా మహాసభలో సిఐటియు నేత పోతురాజు

ప్రజాశక్తి-పాడేరు: వెలుగు విఒఎల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వి.పోతురాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వెలుగు వివోఏల (యూనిమేటర్ల) రెండవ మహా సభ మినుములూరులో శుక్రవారం వివోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్.భాను అధ్యక్షతన నిర్వహించారు . ఈ మహా సభ కు ముఖ్య అతిథిగా హాజరైన పోతురాజు మాట్లాడుతూ, వెలుగు వివోఏల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, జీతాలు పెంచాలన్నారు. గత ఎన్నికల కాలంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెలుగు యూనిమేటర్లకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి యేడాది అయినా అమలు చేయలేదన్నారు. కనీస వేతనాలు పెంచాలని, మూడు సంవత్సరా కాల పరిమితి సర్క్యులర్ రద్దు, ఉద్యోగ భద్రత, బకాయి జీతాలు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ, రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన వారిని నియమించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. నూతన యాప్ ల ద్వారా అదనపు పనులు చేస్తున్నప్పటికీ సేవలకు గుర్తింపు లేదన్నారు.

మాట్లాడుతున్న పోతురాజు

సకాలంలో జీతాలు అందక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పుల ఊబిలో పడుతున్నారన్నారు. సమస్యలు పరిస్కారం చేయకుంటే కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివో ఏల యూనియన్ నాయకులు రాజ్ కుమార్, భాస్కరరావు, సోంబాబు, సువర్ణ, వివోఏలు పాల్గొన్నారు.

అమర వీరుల స్ఫూర్తితో ...

విద్యుత్ భారాలపై మరో ఉద్యమం

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-పాడేరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెంచుతున్న విద్యుత్ బారాలను వ్యతిరేకిస్తూ అమర వీరుల స్ఫూర్తితో మరో ఉద్యమం చేపట్టడం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస హెచ్చరించారు బషీర్బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అశువులు బాసిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పిస్తూ పాడేరులో శుక్రవారం సిపిఎం నాయకులు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.మీ త్యాగాలను వృధా కానివ్వబోమని, మీరు చూపిన సమరశీల బాటలో పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, తదితర వాటిపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం .అప్పలనరస మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముగ్గురు అమరులు అయ్యారన్నారు. ఆ ఉద్యమం ఫలితంగా దాదాపు 2 దశాబ్దాల పాటు విద్యుత్ చార్జీల పెంపుకు ఏ ప్రభుత్వం సాహసించలేదన్నారు.గత వైసిపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలపై వేసిన వేలాది కోట్ల భారాలను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదే విధానాలను కొనసాగిస్తుందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే అమరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు .

సేంద్రియ పంటలపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి: సేంద్రియ వ్యవసాయ పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు కరమని వ్యవసాయ శాఖ ఏడి వి.మోహన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని సిలకలగడ్డ పంచాయతీ సచివాలయం కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఘణ, జీవా మృతం, ద్రవామృతం వంటి వాటి పద్ధతులపై సూచనలు చేశారు. ఈ పద్ధతులు పాటిస్తూ వ్యవసాయ పంటలు పండిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. రసాయనలతో కూడిన యూరియా, డిఏపీలు. వాడితే పంటలు దెబ్బతింటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారి జి.రంగారావు, సర్పంచ్ అప్పారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు, నో పార్కింగ్ జోన్ లపై దృష్టి సారించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణకు అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి రహదారి భద్రతా సమావేశంలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నో పార్కింగ్ జోన్ లపై దృష్టి సారించాలి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల సమాచార నివేదికలను ఎప్పటి కప్పుడు అందించి కేసులు పరిష్కార చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, వైద్య రవాణా తదితర శాఖలు పరస్పర సహకార సమన్వయంతో పని చేయాలని సూచించారు. నో పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పక హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. జాతీయ రహదారి పనులు జరుగున్నప్పటికీ తాత్కాలిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో చింతపల్లి ఎఎస్పి నవ జ్యోతి మిశ్రా, జిల్లా రవాణాదికారి కెవి ప్రకాష్‌రావు, జిల్లా రహదారులు భవనాల ఈఈ బాల సుందర బాబు, అదనపు వైద్య ఆరోగ్య అధికారి టి ప్రతాప్, పంచాయతీరాజ్ డిఈ జి.నరేన్ కుమార్, ఆర్టీసీ, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

వైద్యశిబిరానికి విశేష స్పందన

- ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని అరకు సంత బయలులో ఉన్న ఆక్సిజన్ హాస్పిటల్లో శుక్రవారం అపోలో హాస్పిటల్, ఆక్సిజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలు పొందడానికి బారులు తీరారు. ఈ క్యాంపులో విశాఖపట్నం అపోలో క్యాన్సర్ హాస్పిటల్ నుంచి గైనికాలజిస్ట్, హిమటాలజిస్ట్, ఆంకాలజిస్ట్ వైద్య నిపుణులు పాల్గొని ఏజెన్సీలో ప్రధానంగా ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న రక్తహీనత, సికిల్ సెల్ ఎనీమియా, తల సేమియా వ్యాధులతోపాటు మహిళలకు సంబంధించిన గర్భాశయ వ్యాధులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. దీంతోపాటు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ క్యాంపులో 250 మంది హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆక్సిజన్ హాస్పిటల్ డాక్టర్ ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రక్తహీనత ఉండటంతో సికిల్ సెల్ ఎనీ మియా, తల సేమియా వంటివ్యాధులు వస్తున్నాయన్నారు. మహిళలకు నెలవారీగా జరిగే రుతుస్రావంలో తేడాలతో కేన్సర్ వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. దీంతో ఈ వ్యాధులపై గిరిజనులకు అవగాహనపరిచి ప్రత్యేక స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించి వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం అపోలో క్యాన్సర్ హాస్పిటల్ నుంచి ప్రత్యేక గైనిక్ ఎండి సౌమ్య, ఆంకాలజిస్ట్ ఎండి అబ్దుల్ రషీద్, హిమటాలజిస్ట్ ఎండి బ్రహ్మాజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ గోపి, అపోలో, ఆక్సిజన్ ఆసుపత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెరుగుతున్న గోదావరి

గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం నుంచీ క్రమేపీ చాపకింద నీరులా పెరుగుతూ వస్తోంది. తెలంగాణ నుంచి వరద వస్తుండడంతో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముంపు గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయానికి 43 అడుగులకు నీటిమట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే అధికారులు మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. కంట్రీబోట్లు కూడా ఏర్పాటు చేశారు.

- భద్రాచలం వద్ద ప్రస్తుత నీటిమట్టం 43 అడుగులు
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ముంపు గ్రామాల వాసుల్లో భయాందోళన
- అప్రమత్తమైన అధికారులు

ముంపునకు గురైన రామవరం గ్రామం

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలో శబరి, గోదావరికి వరద నాలుగు రోజుల నుంచి పెరుగుతూ తగ్గుతూ వస్తోంది. అయితే శుక్రవారం ఉదయం నుంచీ క్రమేపీ పెరుగుతూ వస్తోంది. దీంతో ముంపు బాధితులు ఆందోళన చెందుతున్నారు. రహదారులు బయటపడక ఎటు వెళ్లాలన్నా అవకాశం లేక పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం ఏడు గంటలకి 35.4 అడుగులకు చేరింది. ఉదయం పది గంటల నుండి నెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. ముంపు గ్రామాలైన శ్రీరామగిరి, రామవరం, ఆడివెంకన్నగూడెం, చింతరేగుపల్లి, తుష్టివారి గూడెం, గుండుగూడెం, కన్నాయిగూడెం, రామవరంపాడు, జల్లివారి గూడెం, వడ్డిగూడెం, వడ్డుగూడెం కాలనీ గ్రామాలు వరదకు గురవడంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరదలు వచ్చినప్పుడల్లా మూటా ముల్లె సర్దుకుని వెళ్లడం, తగ్గిన తరువాత తిరిగి రావడం జరుగుతోందని, నిర్వాసిత కేంద్రాలకు తీసుకువెళ్లినప్పుడల్లా ఐదు వేలు దాకా ఖర్చు అవుతోందని వాపోతున్నారు. రవాణా చార్జీలు రూ.5 వేలు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ఇవ్వాలని, వరద తగ్గేంతవరకు అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కంట్రీ బోట్లు ఏర్పాటు

గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతున్నందున రోడ్డు బ్లాక్ అయిన గ్రామాల్లో కంట్రీ బోట్స్ ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంతాల్లో మైక్‌తో ప్రచారం చేస్తున్నామని, తహసీల్దార్ స్పష్టంచేశారు. శుక్రవారం తహశీల్దార్ సరస్వతి, మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ నుండి భారీగా వరద రావడంతో భద్రాచలం దగ్గర నీటిమట్టం పెరుగుతోందని లోతట్టు గ్రామాల ప్రజలకు మైక్ ప్రచారం ద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తత చేస్తున్నామన్నారు. కన్నాయిగూడెం, చింతరేవుపల్లి, రామవరం, రామవరం పాడు,జల్లివారిగూడెం, ఏ.వి.గూడెం, తుష్టివారిగూడెం, వడ్డిగూడెం, శ్రీరామగిరి, పోచవరం, ఉప్పూరు, తదితర గ్రామాల్లో హైఅలెర్ట్ చేశామన్నారు.57 అడుగులు రావచ్చని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పై అధికారులతో మాట్లాడామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు.

ఆంధ్రా,ఒడిస్సాకు రవాణా సౌకర్యం

చింతూరు: కుయుగూరు వాగు ప్రవాహం తగ్గడంతో జాతీయరహదారిపై వరద నీరు తగ్గి రహదారి సౌకర్యం ఏర్పడింది. ఆంధ్రా ఒరిస్సా వెళ్లే వాహనాలు యధావిధిగా నడిచాయి. రెండు రోజులుగా వాహనదారులు రోడ్లపైనే వాహనాలను నిలుపుకుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నందిగామ వాగు వద్ద వరద పరిస్థితి

నిత్యావసర సరుకులు లేవు..

మూడు రోజులుగా వరదలు రావడం వలన మండలంలోని చాలా గ్రామాల చుట్టూ నీరు చేరి రహదారి మార్గాలు లేక కొనడానికి నిత్యావసర సరుకులు దొరక్క బయట ప్రాంతాలకు వెళదామంటే రహదారి వరదనీటితో మునిగి పోవడం వల్ల ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం తెలిపింది. కల్లేరు పంచా యితీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పొడియం జానీ మాట్లాడుతూ వరద వల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కునే బాధితులకు తక్షణమే నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. కూయుగురు, కల్లేరు, స్టాపర్ పేట, సూరన్నగొంది మధుగూరు గ్రామాలకు బయటకు వెళ్లే మార్గం లేదన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం కల్లేరు పంచాయతీ సభ్యులు కారం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: తగ్గినట్టే తగ్గిన గోదావరి వరద శుక్రవారం ఉదయం నుండి మళ్ళీ పెరుగుతోంది. ఒకరోజు తగ్గుతూ మరో రోజు పెరుగుతూ ఉన్న గోదావరి శుక్రవారం ఉదయం నుంచీ మాత్రం క్రమేపి పెరుగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 6గంటలకు 35.2 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రం 43 అడుగులకు చేరుకుంది. ఎగువ నుండి వరద వస్తుండడంతో వరద మరింత పెరిగే అవకాశముందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

ఒడ్డుగూడెంలో మైక్‌తో వరదపై అప్రమత్తం చేస్తున్న విఆర్ఒ

రంపచోడవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి -వి.ఆర్‌పురం : రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లాను ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రేఖపల్లిలో పూనెం ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఆదివాసీ గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లాను ప్రకటించాలని, ప్రస్తుతం రంపచోడవరం నియోజకవర్గంలో 11 మండలాలు ఉన్నాయని వాటితో పాటు ఏలూరులోని నాలుగు మండలాలు నాన్‌ఏజెన్సీలో గిరిజన గ్రామాలను కలుపుతూ కొత్త జిల్లాను రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేయడం వలన పరిపాలన సౌలభ్యం సులభతరం అవుతుందని, ప్రజలంతా ఏ సమస్య వచ్చినా జిల్లా కేంద్రానికి వెళ్లి వారి సమస్యను చెప్పుకోవడానికి అందుబాటులో అధికారులు ఉంటారని ఆయన పేర్కొన్నారు. దీనికి తోడుగా ఏలూరులో మండలాలు రంపచోడవరం నియోజకవర్గంలో ఐదు మండలాలు పోలవరం ప్రాజెక్టు వలన ముంపునకు గురయ్యే మండలాలు అని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం నిర్వాసితులకు జిల్లాస్థాయి అధికారులు అంతా అందుబాటులో ఉంటారని, కావున తక్షణమే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తూ ప్రకటన చేయాలని ఆదివాసి గిరిజన సంఘంగా ప్రభుత్వాన్ని కోరుతూ డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. అవసరమైతే జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమాలకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, పూనెం ప్రదీప్‌కుమార్, బాబుబోరయ్య, పులిబొజ్జి, మొట్టు రాజయ్య, కారం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

గాలికొండ, ఎ.ధారకొండను జికెవీధి మండలంలో కొనసాగించాలి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గాలికొండ, ఏ ధారకొండ పంచాయతీలను జికె వీధి మండలంలో కొనసాగించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశామని సిపిఎం గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు వెల్లడించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీలకు జికె వీధి మండలం అందుబాటులోనే ఉందని,అందులోనే కొనసాగించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కి వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించారని బుజ్జిబాబు తెలిపారు. ఉపసర్పంచ్ ఎం చంటిబాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలకు చిక్కిన గెలాస్కోపీ చేప

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు నదిలో శుక్రవారం మత్స్యకారుల వలకు అరుదైన గెలాస్కోపి చేప చిక్కింది. ఈ చేప టార్ జాతికి చెందినది ఇది ఎక్కువ శాతం హిమాల యాల్లో చల్లటి ప్రదేశాలను లభ్యమవు తుంటాయి. ఇటువంటి అరుదైన 12 కిలోల బరువు గల గెలాస్కోపి సీలేరు నదిలో దొరకడం విశేషం. గతంలో పలుమార్లు గెలాస్కోపీ చేప లభ్యమైంది. ఔషధాల్లో ఉపయోగించడానికి ఈ చేపను వాడతారు. శుక్రవారం మత్స్యకారులకు లభ్యమైన గెలాస్కోపి చేపని వ్యాపారి మారిబాబు కొనుగోలు చేసి సీలేరు మార్కెట్ కి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎపి జెన్కో ఎఇ సిహెచ్ సురేష్ ఆసక్తితో రూ.2500కు మారిబాబు దగ్గర కొనుగోలు చేశారు.

గెలాస్కోపీ చేప

ఆటలు ఆడుతున్న పిల్లలు

ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక విజ్ఞాన భారతి ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని పలు రకాల క్రీడలను ఆడించారు.ఆటలతో పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పాఠశాల కరస్పాండెంట్ మత్యరాజు, ప్రిన్సిపల్ టి. రమేష్ కుమార్ తెలిపారు.

బీరం పంచాయతీని జి.మాడుగులలో కొనసాగించాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల:మద్దిగరువును నూతన మండలంగా ప్రకటిస్తే అందులో బీరం పంచాయతీని చేర్చుతారని వస్తున్న వార్తల నేపథ్యంలో బీరంను జి.మాడుగుల మండలంలోని ఉంచాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.మద్ది గరువు మండలంలో బీరం పంచాయతీని చేరిస్తే అటు వైద్య సేవలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. జి మాడుగుల చేరుకోవాలంటే ఎనిమిది కిలోమీటర్లు వస్తుందని, మద్దిగరువు 15 కిలోమీటర్లు దూరం వస్తుందని వీటన్నింటినీ ఉన్నతాధికారులు దృష్టిలో ఉంచుకొని జిమాడుగుల మండలంలోని కొనసాగేటట్టు చూడాలని సర్పంచ్ ఎం రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసా అధ్యక్ష ఉపాధ్యక్షులు పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న నాయకులు

ఉచిత గ్యాస్‌పై కూటమి మోసం : వైసిపి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:ఉచిత వంట గ్యాస్ పథకం ద్వారా ప్రతి ఏడాది ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసీపీ మండల అధ్యక్షుడు పి.పరశురాం విమర్శించారు. శుక్రవారం అరకు వారపు సంతలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం దేవుడేరుగు అధిక ధరలకు ఏజెన్సీ ప్రాంతంలో విక్రయించడంతో గిరిజనులు వాటిని కొనుగోలు చేసి ఉపయోగించు కోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధిక ధరలతో విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, సర్పంచ్ జి.నాగేశ్వరరావు, నాయకులు బి.సింహాచలం కే.విజయదశమి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీచేసినట్లు విశాఖపట్నం సర్కిల్ ఎస్ఇ జి.శ్యాంబాబు తెలిపారు. విద్యుత్ శాఖ సూచనలను పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని, విద్యుత్ దొంగతనం ప్రమాదకరం, చట్టవిరుద్ధం అని, లైసెన్స్ ఉన్న ఎలక్ట్రీషియన్లు, విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రిషియన్లు, నిపుణుల ద్వారా చేయించాలని పేర్కొన్నారు. తెగిన, సడలిన వైర్లు జాయింట్లు వాడరాదని, ఇన్సులేషన్ టేప్‌తో కవర్ చేయాలని తెలిపారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

పిజిఆర్ఎస్‌కు 121 అర్జీలు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరుటౌన్:ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలత, ఎస్‌డిసి ఎంవిఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 121 వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

రాజఒమ్మంగి మండలం కె.వెలగలపాలెం గ్రామానికి చెందిన నక్కా నాగరాజు తనకి చేతులు, కాళ్ళు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని పింఛన్ మంజూరూ చేయాలని దరఖాస్తు అందజేశారు. పాడేరు మండలం కిడంగి గ్రామానికి చెందిన తలారి బాలకృష్ణ తన కుటుంబం గత మూడు తరాల నుండి కొండపాడి చేస్తున్నామని, మొక్కలు, దినుసులు పండిస్తున్నామని, మాకు కొండపాడి తప్ప ఎటువంటి ఆధారం లేదని భూములు సర్వే చేయించి పట్టా ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. పెదబయిలు మండలం గంపరాయ పంచాయితీ కాగుల గ్రామానికి చెందిన బి.బొంజుబాబు తన గ్రామంలో 55 కుటుంబాలకు గాను 26 కుటుంబాలకు మాత్రమే కొళాయి కనెక్షన్ ఉందని, 29 కుటుంబాలకు కూడా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నందు, డిఆర్‌డిఎ పిడి వి.మురళీ, డ్వామా పిడి విద్యాసాగర్, ఆర్అండ్ బి ఇఇ బాలసుందర బాబు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, డిపిఒ పిఎస్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంపుదలకు కొత్త ప్రాజెక్ట్

జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు :- అల్లూరి జిల్లాలో ఏ వన్ ఆధారిత సలహాలతో రైతుల ఆదాయాన్ని పెంపుదల" అనే ప్రాజెక్ట్ ను శుక్రవారం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైక్రోసాఫ్ట్ ఇండియా సహకారంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన శాఖతో భాగస్వామ్యంగా డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ 'కృత్రిమ మేధ (ఏ వన్) ఆధారిత సలహాలతో రైతుల ఆదాయాన్ని పెంపుదల" అనే ప్రాజెక్టను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఫార్మర్ చార్ట్ మొబైల్ అప్లికేషన్‌ను జిల్లా ఉద్యాన అధికారి ఏ. రమేశ్ కుమార్, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ జి. శ్రీకాంత్, అరకు వ్యాలీ ఉద్యాన అధికారి కె. శిరిష, ఆర్ వై ఎస్ ఎస్ బృంద సభ్యులు, గ్రామ ఉద్యాన సహాయకులు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. ఏ వన్ ఆధారిత డిజిటల్ సహాయకుడు ఫార్మర్ చాట్ రైతులకు సమయానుకూలంగా, తక్కువ ఖర్చుతో సమాచారాన్ని అందజేస్తుందన్నారు.మెరుగైన వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉత్పాదకత పెంచడం, వాతావరణ మార్పులకు ప్రతిస్పందన పెంపుదల, రైతుల జీవన భద్రతను బలపరచడం. లక్ష్యమని జిల్లా ఉద్యాన అధికారులు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్

బిసిల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న బిసి కులాల ఆర్థికాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హామీ ఇచ్చారు. అల్లూరి జిల్లా సందర్శనకు వచ్చిన ఆయన శుక్రవారం పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ బిసి కులాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. జీవన భృతి నేపథ్యంలో 40, 50 ఏళ్లగా పాడేరు గిరిజన ప్రాంతంలో జీవనం సాగిస్తున్న బిసి కులాల వారి స్థితిగతులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో జీవనం సాగించడంతో అనేక ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోలేని పరిస్థితిలో బిసి కులాలకు చెందిన వారున్నారన్నారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లాలో ఉన్న అన్ని బిసి కులాలు ఏకతాటిపైకి వచ్చి సంఘటితంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

నేరాలు ఘోరాలు

నిందితులతో పోలీసులు

పలుచోట్ల 415 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి రవాణా చేస్తున్న 350 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు పాడేరు అడిషనల్ ఎస్పీ ధీరజ్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ గంజాయి రవాణా కు సంబంధించి వివరాలు తెలిపారు. ఒడిస్సా ప్రాంతంలో ఈ గంజాయిని కొనుగోలు చేసి రవాణా వెనుక పెదబయలు, ముంచంగిపట్టు ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు తమ దర్యాప్తులో తెలిసిందన్నారు. అనకాపల్లి పరిధిలోని ఒక వ్యక్తికి ఈ గంజాయిని అందించేందుకు రవాణా చేస్తున్నారని ఒక మోటార్ బైక్ పైలెట్ సాయంతో బొలెరో వాహనంలో తీసుకెళ్తున్నారని చెప్పారు. కొంత దూరం కాలినడకన మరి కొంత దూరం మోటార్ బైక్‌లపై గంజాయిని తరలించుకొని వచ్చారని చెప్పారు. గంజాయి రవాణా వెనక ఉన్న వారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిమాడుగుల సిఐఎస్ఐలు సన్యాసినాయుడు షణ్ముఖరావు పాల్గొన్నారు.

పెదబయలు : ఒడిశా నుండి తీసుకొస్తున్న 65 కేజీల గంజాయిని పెదబయలు పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ప్రకారం... ఈ నెల 27న సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు సీతగుంట పంచాయతీ పరిధి రోగులపేట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బూసిపుట్టు నుండి ఒడిశా రిజిస్ట్రేషన్ ఉన్న ఒడి 30ఎఫ్ 7738 అనే వాహనంలో 65 కేజీలు గంజాయి పట్టుబడింది. ఆ గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

తల్లిదండ్రుల చెంతకు దారితప్పిన గిరిజన బాలుడు

ప్రజాశక్తి-చింతపల్లి : దారి తప్పిపోయి చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ఒంటిరిగా తిరుగుతున్న గిరిజన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని బాలుడు ఒంటరిగా తిరుగుతూ కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి బాలుడిని తమ సంరక్షణలోకి తీసుకున్నారు. బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి భోజన వసతి కల్పించి రెండు రోజుల పాటు తమ సంరక్షణలో ఉంచారు. ఈ సమయంలో బాలుడి వివరాలు తెలిశాయి. బాలుడు మర్రి రోశయ్య (8) తండ్రి దావీదు కొయ్యూరు మండలం పెన్నేలకోట గ్రామానికి చెందినవాడని తెలిసింది. ఈ మేరకు శుక్రవారం రోశయ్య తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఫోక్సో చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -గంగవరం: ఫోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల బాలికలకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. శక్తిటీమ్స్, మైనర్లపై జరుగుతున్న దాడులపై మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్1098కు ఫోన్ చేయాలన్నారు. పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిజిఆర్ఎస్ జైపర్సన్ సత్యనారాయణ

'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు (సిజిఆర్ఎస్) తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జైపర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ సాంకేతిక సభ్యులు ఎన్.రాజబాబు, స్వతంత్ర ఎస్.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం సంస్థ రంపచోడవరం డివిజన్ ఆధ్వర్యంలో రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో రాజవొమ్మంగి విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుండి 5 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియేల్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.గోపాలకృష్ణ విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అందించాలి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కూటూరు సచివాలయానికి వ్యవసాయాధికారి దేవి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను కూటూరు సర్పంచ్ వెంకమ్మ, మాజీ సర్పంచ్ సీతారామయ్య, మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరరావు కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది రైతులకు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు పడలేదని తెలిపారు. ముల్లూరు గ్రామంలో ఉన్నటువంటి గిరిజన రైతులకు భూమి ప్యాకేజీలో 6:1/25 ఎకరాలు ప్రభుత్వ మినహాయించింది వారికి ఇంకా భూమికి భూమి ఎక్కడ చూపించనందువల్ల తప్పనిసరిగా ప్రభుత్వం పథకాలు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

పశువులను రహదారిపై వదిలేస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు రోడ్లపై పశువులు వదిలితే పశుయజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజవొమ్మంగి తహశీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ నరసింహమూర్తి శుక్రవారం హెచ్చరించారు. శుక్రవారం రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్లో పశు యజమానులతో తహశీల్దార్ ఎ సత్యనారాయణ, ఎస్ఐ నరసింహమూర్తి సమావేశం నిర్వహించారు. పశు యజమానులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలిస్తామని పశు రైతులను హెచ్చరించారు. పలువురు పశు యజమానులు, పోలీస్ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

చింతపల్లి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మహిళాసంఘ సభ్యులు

అరకు శారదా నికేతన్ స్కూల్‌లో..

సీలేరు: కవుల వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి జయంతి తెలుగు భాషాదినోత్సం హిందీ విభాగాధిపతి కె.శైలజ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నమాణిక్యం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి వ్యహరిక భాషోద్యమంలో పాల్గొని తెలుగుభాష అభివృద్ధికి కృషి చేసిన గొప్ప కవి, రచయిత అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, సీనియర్ అధ్యాపకులు వెంకట్రావు, యస్.అప్పనమ్మ, కె.శకుంతల, జి.హరతి, యం.నాగ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: జాతీయ తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురుకుల పాఠశాలలో, ప్రిన్సిపాల్ జి.వెంకయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గిడుగు తెలుగుభాషకు చేసిన సేవను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు డిఏవి పాఠశాలలో జాతీయ తెలుగు దినోత్సవం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కిరణ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు పలువురు కవుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలోని ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి వ్యవహారికభాష ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.

అరకులోయరూరల్:అరకులోయ మండల కేంద్రంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి హెచ్ఎం చిరంజీవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు పండితుడు బేరిబేడి సన్యాసిరావు, వ్యాయామఉపాధ్యాయుడు బోండా శివకుమార్‌ను మహిళా సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. పిఆర్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు యువి.గిరి మాట్లాడుతూ తెలుగు భాషకు విశిష్టమైన ఔన్నత్యం ఉందని చెప్పారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, తోడ్పడతా యన్నారు. హెచ్ఎం నమ్మి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి గురుకుల పాఠశాలలో..

చింతూరు డిగ్రీ కళాశాలలో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - విఆర్‌పురం: సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వరరావునాయుడు స్థానిక రేఖపల్లి వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జనరల్‌వార్డు పరిశీలించి ఓ చిన్నారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు నిల్వఉన్న గదిని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ల్యాబ్, డ్రెస్సింగ్‌రూం, ప్రసూతిగది, జనరేటర్ రూం క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి పనితీరు బాగుందని, అన్ని రకాల సీజనల్ వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలో కొత్త వైద్యులు రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని చెప్పారు. డిఎంహెచ్ఒ పుల్లయ్య, రేఖపల్లి వైద్యులు అనిల్‌కుమార్, మహిళా వైద్యురాలు స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పిహెచ్‌సి పరిధిలో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో బాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ అన్నారు. శుక్రవారం వైద్యాధికారి సుష్మ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాజవొమ్మంగి పిహెచ్‌సిలో ఓపీ సంఖ్య 100 దాటుతోందని అందులో ఎక్కువగా వైరల్ ఫీవర్స్ ఉంటున్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. చలమల నీరు తాగడం వలన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే రోగులు నేరుగా పిహెచ్‌సికి రావాలని సూచించారు.

సొంత డబ్బుతో రహదారి పనులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ పెట్రాయి గ్రామం నుంచి సరిహద్దుల్లో ఉన్న ఒడిశాకు వెళ్లే ఒక కిలోమీటర్ రహదారిని ఆ గ్రామస్తులు తమ సొంత డబ్బు వ్యయం చేసి మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. పెట్రాయి పరిసర గ్రామాల నుంచి నిత్యావసర సరుకులకు పక్కనే ఉన్న సరిహద్దు చిత్రకొండకి రాకపోకలు చేయాల్సి వస్తుంది. రహదారి బురదమయం కావడంతో కిలోమీటర్ వరకూ మట్టి రోడ్డు నిర్మించుకున్నారు.అధికారులు స్పందించి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మాజీ వార్డు సభ్యుడు కొర్ర బలరామ్. డిమాండ్ చేశారు.

ధారకొండ పంచాయితీ పెట్రాయి నుంచి ఒడిశాకు వెళ్లే రోడ్డు

పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-చింతూరు: పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా కనీస వేతనం రూ21 వేలు ఇవ్వాలని, జిఒ 551 అమలు చేసి గుర్తింపుకార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు స్థానికపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది పంచాయతీ కార్మికులు, గ్రీన్‌అంబాసిడర్లు ఉన్నారని, ఒకే రకమైన పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా 21 వేలు వీరికి కూడా వేతనాలు చెల్లించాలన్నారు. 6 వేల నుండి 12 వేల వరకు వేతనాలు చెల్లించడం జరుగుతోందని ఒకేరకమైన వేతనాల చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించి, కనీస వేతనాలు 21వేలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, కోర్టు తీర్పులు , 551 జిఒ అమలు చేసి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, 10 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి గంగరాజుకు అందించారు. వేతనాలు త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకులు సీసం సురేష్, ముట్టం రాజయ్య, కారం నాగేష్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలో వైద్య ఆరోగ్యశాఖ అధికార డాక్టర్ విశ్వేశ్వరనాయుడు చింతూరు డివిజన్ పర్యటనలో భాగంగా మండలంలోని కుటూరు, కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు సిబ్బందితో మాట్లాడుతూ వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు తెలిపారు. వరదలు వచ్చినప్పుడు, వరదలు తగ్గిన తరువాత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కూనవరం పిహెచ్‌సిని సందర్శించి స్టాఫ్ నర్స్‌లను నియమిస్తామని తెలియచేశారు. డిఎంహెచ్ఒ పుల్లయ్య పిహెచ్‌సి వైద్యులు రాజీవ్, నవ్య పాల్గొన్నారు.

'గిరిజనుల సామాజిక సాధికారతే లక్ష్యం'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాష్ట్రంలో గిరిజన సమాజానికి ఆర్థిక సామాజిక రాజకీయ సాధికారత కల్పించడంలో ఎపి గిరిజన సంక్షేమ కమిటీ లక్ష్యమని కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు, రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శుక్రవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి ఎస్టీ సంక్షేమ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన సమాజానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కల్పించడం కమిటీ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పథకాల పర్యవేక్షణ, కమిటీ విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు.

ఫుడ్‌మ్యానుఫ్యాక్టరింగ్ సమ్మిట్‌లో ఆదివాసీ రైతులు

ప్రజాశక్తి -సీలేరు: ఇండియన్ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమిట్‌లో జికె వీధి మండల ఆదివాసి రైతులు పాల్గొన్నారని అభ్యుదయ రైతులు గడుతురు రామలక్ష్మీ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల వాణిజ్యం ఆహార ప్రాసెసిం గ్ మంత్రిత్వ శాఖ నుండి ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో జరిగిన మూడో ఎడిషన్ ఇండియన్ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌లో పాల్గొన్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్ తయారీ రంగాల్లో కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారని తెలిపారు. అభ్యుదయ రైతులు అడప పూర్ణచంద్రరావు, అడపాలక్ష్మి పాల్గొన్నారని తెలిపారు.